సాక్షి
అనంతపురం
బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.20,600

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20,600 పలికాయి.



టమాట కిలో రూ.13

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.6°/ 10.9°

జిల్లా అంతటా మంగళవారం చలి వాతావరణం కొనసాగింది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

31 మండలాల్లోనూ కంది కొనుగోళ్లు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలోని 31 మండలాల్లోనూ కనీస మద్దతు ధర (క్వింటా రూ.7,550) ప్రకారం కందుల కొనుగోళ్లు జరుగుతున్నాయని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 800 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. ఈ వారంలో 147 మంది రైతుల ఖాతాల్లోకి డబ్బు జమ అవుతుందన్నారు. కొనుగోలు చేసిన 15 రోజుల్లోపు జమ చేస్తామని తెలిపారు. కందులు అమ్మడానికి ఇప్పటికే 6 వేల మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, దిగుబడులను బట్టి ఈ-క్రాప్ ఆధారంగా ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్లు కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు.

నేడు తుది విడత షీప్ సొసైటీ ఎన్నికలు

అనంతపురం అగ్రికల్చర్: గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘాల (షీప్ సొసైటీ) ఎన్నికల ప్రక్రియలో భాగంగా బుధవారం తుది విడతగా 14 సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు పశుశాఖ షీప్ డెవలప్‌మెంట్ ఏడీ కేఎల్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మొత్తం 121 సంఘాలకు నోటిఫికేషన్ విడుదల చేయగా.. గత నెల 7న తొలివిడతగా 36 సంఘాలకు, రెండో విడతగా 18న 36 సంఘాలకు, మూడో విడతగా 25వ తేదీ 25 సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలు, బెదిరింపులు కారణంగా మూడు విడతల్లో 20 సంఘాలకు ఎన్నికలు ఆగిపోయాయి. రికార్డులు సరిగా లేవంటూ రద్దు చేశారు. ఆయా సంఘాలకు మళ్లీ పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించనున్నారు. విచారణ చేపట్టి మళ్లీ ఎప్పుడు ఎన్నికలు నిర్వహించేది ప్రకటించనున్నారు. నాలుగో విడతగా బుధవారం 14 సంఘాలకు ఎన్నికలు నిర్వహించి ప్రక్రియ ముగించనున్నట్లు పశుశాఖ వర్గాలు తెలిపాయి.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



ఇంజిన్ నుంచి విడిపోయి పక్కకు ఒరిగిన బోగీలు

గుంతకల్లు: గూడ్స్ రైలు పట్టాలు తప్పిన ఘటన గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో మంగళవారం సాయంత్రం జరిగింది. బోగీల మధ్య ఉండే కప్లింగ్‌లు విడిపోవడంతో ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వివరాలు.. కర్ణాటక రాష్ట్రంలోని తోర్నగల్లు రైల్వేస్టేషన్ నుంచి గుత్తికి వెళ్తున్న గూడ్స్ రైలు బోగీల మధ్య ఉన్న కప్లింగ్ విడిపోయింది. దీంతో ఇంజిన్ నుంచి 12, 13 నంబర్ బోగీలు పక్కకు ఒరిగాయి. గుంతకల్లు జంక్షన్‌లోని సౌత్ క్యాబిన్ వద్ద ఈ ఘటన జరిగింది. ఇది ముంబై-చెన్నై ప్రధాన రైలు మార్గం కావడంతో గుంతకల్లు జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అంతరాయం కల్గింది. హుబ్లీ- నరసాపూర్ మధ్య నడిచే అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను గంటకు పైగా గుంతకల్లు రైల్వే జంక్షన్‌లోనే నిలిపివేశారు. తర్వాత ఈ రైలును బైపాస్ లైన్ ద్వారా పంపించారు. బెంగళూరు-భువనేశ్వర్ మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలును నక్కనదొడ్డి రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. అలాగే చెన్నై-ముంబై (దాదర్ ఎక్స్‌ప్రెస్) రైలు ఆలస్యంగా నడిచింది.

ఆలస్యంగా సైరన్..

ప్రమాదం సాయంత్రం 6.10 గంటలకు చోటు చేసుకోగా.. హెచ్చరిక సైరన్ 6.36 గంటలకు మోగింది. దీంతో క్లియరెన్స్ పనులు ఆలస్యంగా మొదలయ్యాయి. ఏడీఆర్ఎం సుధాకర్‌తో పాటు సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పనులు ప్రారంభించారు. గూడ్స్ రైలుకు రెండు వైపులా ఇంజిన్‌లు అతికించి బోగీలను వేరు చేశారు. అనంతరం పక్కకు ఒరిగిన బోగీలను తొలగించారు.



విశేషాలంకరణలో బూదగవి సూర్యదేవుడు

సూర్యదేవా నమోస్తుతే..

రథసప్తమి వేడుకలు జిల్లావ్యాప్తంగా మంగళవారం ఘనంగా జరిగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్య నమస్కారాలతో ప్రజలు భక్తిప్రపత్తులు చాటారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో 'సామూహిక సూర్య నమస్కార యజ్ఞం' కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఇంజినీరు సుధాకర్, వివేకానంద యోగా కేంద్ర అధ్యక్షుడు మెళవాయి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ రోజూ సూర్య నమస్కారాలతో మనసు ఉల్లాసంగా ఉంటుందన్నారు.

– అనంతపురం కల్చరల్:





అనంతపురం చెరువు కట్ట వద్ద చిన్నారుల సూర్య నమస్కారాలు



అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న ప్రజలు

వైఎస్ జగన్ ప్రోత్సాహం.. | ప్రపంచ పటంలో ఉద్యానం

- గత ప్రభుత్వ చేయూతతో లక్షల హెక్టార్లకు విస్తరించిన తోటలు
- ఏటా 25.95 లక్షల మెట్రిక్ టన్నుల మేర ఫలసాయం
- అరటి, చీనీ, మామిడి, మిరప, టమాట 'జీవీఏ' అధికం
- గత సర్కారు కృషితో సత్ఫలితాలు
- నేడు 'అనంత' హార్టికల్చర్ కాన్‌క్లేవ్



అనంతపురం అగ్రికల్చర్: సూక్ష్మసాగు కింద డ్రిప్, స్ప్రింక్లర్లు రాయితీతో అందిస్తూనే పండ్లు, కూరగాయలు, పూల తోటలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహకాలు కల్పించారు. మేలైన యాజమాన్య పద్ధతులు (గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్), సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ప్యాక్‌హౌస్, కలెక్షన్ సెంటర్లు, కోల్డ్‌రూంలు, కోల్డ్‌స్టోరేజీలు, పోస్ట్ హార్వెస్టింగ్, కార్పొరేట్ కంపెనీల భాగస్వామ్యం, ఎగుమతులు, మార్కెటింగ్ తదితర వాటికి రాయితీలు ఇచ్చి కొత్త పుంతలు తొక్కించారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో సైతం 2020, 2021లో ఉద్యాన రైతులకు దన్నుగా నిలిచారు. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేయూత కారణంగా ప్రపంచ పటంలో జిల్లా ఉద్యాన తోటలకు స్థానం లభించిందంటే అతిశయోక్తి కాదు.

నేడు 'హార్టికల్చర్ కాన్‌క్లేవ్'..

అనంతపురం ఎంవైఆర్ కన్వెన్షన్ హాలులో బుధవారం 'హార్టికల్చర్ కాన్‌క్లేవ్' జరగనుంది. దేశంలోని పలు ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు, ఎగుమతి సంస్థలు, ఉత్పత్తిదారులు ఇందులో పాల్గొంటున్నారు. అరటికి ప్రాధాన్యత ఇస్తూనే మిగతా ఉద్యాన పంటలు, ఉత్పత్తులు, మార్కెటింగ్ అంశాల గురించి చర్చించి 'అపెడా', ఉద్యానశాఖ సంయుక్తంగా జిల్లా రైతులకు ప్రయోజనం కలిగేలా పరస్పర ఒప్పందాలు చేసుకునేలా ప్రణాళిక రచించారు. జిల్లా వ్యాప్తంగా 1.04 లక్షల హెక్టార్లలో ఉద్యాన తోటలు విస్తరించగా వాటి నుంచి ఏటా 25,95,795 మెట్రిక్ టన్నుల ఫలసాయం వస్తోందని ఆ శాఖ నివేదిక తయారు చేసింది. అందులో ప్రధానంగా అరటి, మామిడి, మిరప, టమాట, చీనీ... ఈ ఐదు పంటల ద్వారా ఏటా 20.80 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడులు వస్తుండగా వాటి ద్వారా రూ.5,535 కోట్ల మేర టర్నోవర్ జరుగుతోందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. 2047 నాటికి ఉద్యాన తోటల దిగుబడులు, టర్నోవర్ మరో 15 శాతం పెంపు లక్ష్యంగా కార్యాచరణ ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం 10,946 హెక్టార్ల అరటి ద్వారా 6.02 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడులు వస్తుండగా రూ.1,204 కోట్ల జీవీఏ (స్థూల విలువ జోడింపు) వస్తోంది. 10,128 హెక్టార్ల మామిడి ద్వారా 56 వేల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుండగా రూ.567 కోట్ల జీవీఏ వస్తోంది. 14,177 హెక్టార్ల మిరప ద్వారా ఏటా 71 వేల మెట్రిక్ టన్నులు దిగుబడులు వస్తుండగా రూ.1,205 కోట్ల మేర టర్నోవర్ జరుగుతోందని చెబుతున్నారు. అలాగే 16,618 హెక్టార్ల టమాట ద్వారా ఏటా 8.30 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి, రూ.997 కోట్ల జీవీఏ వస్తోంది. 37,186 హెక్టార్ల చీనీ తోటల నుంచి ఏటా 5.21 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడులు వస్తుండగా, రూ.1,562 కోట్ల టర్నోవర్ జరుగుతోంది. 'కాన్‌క్లేవ్' ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లాను ప్రమోట్ చేయాలని నిర్ణయించినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

సత్ఫలితాలు..

గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉద్యాన రంగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించిన ఫలితంగా నేడు 'అనంత' హార్టికల్చర్ కాన్‌క్లేవ్‌కు బీజం పడింది. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో పండ్లతోటల విప్లవానికి శ్రీకారం చుట్టడంతో ఉమ్మడి అనంతపురం జిల్లా 'ఫ్రూట్‌బౌల్ ఆఫ్ ఏపీ'గా ఖ్యాతి పొందింది. దాన్ని కొనసాగిస్తూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉద్యాన రైతులకు అడుగడుగునా చేయూతనిచ్చారు. 'అనంత'ను ఉద్యాన హబ్‌గా మార్చి ప్రపంచ చిత్రపటంలో జిలలాకు ప్రత్యేక ఖ్యాతి తీసుకొచ్చారు. వైఎస్ జగన్ హయాంలో ఈ-క్రాప్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో కచ్చితమైన సాగు లెక్కలు అందుబాటులోకి వచ్చాయి. గత మూడేళ్ల ఈ-క్రాప్ గణాంకాలు పరిగణనలోకి తీసుకుంటే దేశంలో మరెక్కడా లేని విధంగా 'అనంత'లో 70 రకాల వరకు ఉద్యాన తోటలు సాగవుతుండటం గమనార్హం.

'హార్టికల్చర్ కాంక్లేవ్'కు కార్పొరేట్ స్థాయి ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అగ్రికల్చర్: 'అనంత హార్టికల్చర్' కాంక్లేవ్‌కు కార్పొరేట్ స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంవైఆర్ కన్వెన్షన్ హాలులో కాంక్లేవ్ ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాంక్లేవ్ జరుగుతుందన్నారు. ఎక్కడా ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. బ్రోచర్లు, ఐడీ కార్డులు సిద్ధం చేయాలని డీపీఓను ఆదేశించారు. 23 మంది లైజన్ అధికారులను నియమించామని, వారికి శిక్షణ ఇచ్చి అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. స్టేజీ సీటింగ్, పీపీటీ, స్టాల్స్, పుష్పాలంకరణ, రిజిస్ట్రేషన్ డెస్క్ తదితర ఏర్పాట్లు కార్పొరేట్ స్థాయిలో ఆకర్షణీయంగా ఉండాలన్నారు. జాతీయ స్థాయి కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారని, జిల్లా రైతులకు ఉపయోగపడేలా ఎంఓయూలు కుదుర్చుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఆర్డీఓ కేశవనాయుడు, అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అంతటా కల్తీ పాలే..

- మాల్టోడెక్స్‌ట్రిన్ కలిపి చిక్కగా మారుస్తున్నారు
- అదనపు ధరకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు
- అనంతపురం నగరంలో ప్రతి చోటా ప్యాకెట్, లూజు పాలు కల్తీవే
- వివరాలు వెల్లడించిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం



అధికారులు స్వాధీనం చేసుకున్న వస్తువులు

అనంతపురం: జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ కల్తీ పాలు విక్రయిస్తున్నారని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ నాగభూషణం తెలిపారు. ప్యాకెట్ పాలలోనూ, లూజుగా అమ్మే వాటిలోనూ హానికరమైన రసాయనాలు కలిసి ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం అనంతపురంలోని ఆయన కార్యాలయంలో సీఐ శ్రీనివాసులు తదితరులతో కలసి విలేకరులతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. ''జిల్లాలోని ప్రతి ఊరిలోనూ కల్తీ పాలు తయారు చేస్తున్నారు. అనంతపురం నగరంలోని సింహభాగం డెయిరీలు, లూజుగా అమ్మే వారు పాలు కల్తీ చేస్తున్నట్లు పరిశీలనలో తేలింది. ముందుగా మాల్టోడెక్స్‌ట్రిన్ అనే తెల్లటి పొడరుకు పామాయిల్, ఉప్పు కలిపి గ్రైండర్‌లో చిక్కటి ద్రావణంగా మారుస్తారు. ఈ ద్రావణాన్ని కొద్ది మోతాదులో ఒక లీటర్ పాలలో కలిపి గ్రైండర్‌లో మిక్స్ చేస్తారు. తర్వాత దాన్ని 20 లీటర్ల పాలకు కలుపుతారు. దీంతో అవి చిక్కగా తయారవుతాయి. ఈ పాలను లీటరకు రూ.10 అదనంగా అమ్ముతున్నారు. గత కొంతకాలంగా ఈ దందా జరుగుతోంది. రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లికి చెందిన రామిరెడ్డి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా.. ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో అతనిపై కేసు నమోదు చేయడంతో పాటు పాల కల్తీకి వినియోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నాం. ఇదే గ్రామంలో మరో చోట కల్తీ జరుగుతోంది. అయితే తనిఖీలకు వెళ్లిన సమయంలో సదరు వ్యక్తి అక్కడ లేరు. ఈ కల్తీ పాలు తాగితే గ్యాస్ట్రిక్ సమస్యలు, అల్సర్లు వస్తాయి. శరీరంలోని మంచి బ్యాక్టీరియాను చంపేయడం వల్ల రకరకాల జబ్బులు వచ్చే ప్రమాదముంది.

కమలానగర్‌లో పౌడర్ విక్రయాలు

ప్రమాదకరమైన మాల్టోడెక్స్‌ట్రిన్ పొడరును అనంతపురం నగరంలోని కమలానగర్‌లో ఉన్న కుమార్ ఎంటర్‌ప్రైజెస్‌లో విచ్చలవిడిగా అమ్ముతున్నారు. దీన్ని సాధారణంగా బిస్కెట్లు, కేకుల తయారీలో చాలా తక్కువ మోతాదులో వినియోగిస్తారు. దీనివల్ల కేకులు చిక్కగా తయారవుతాయి. కానీ ఏకంగా పాలలో కలుపుతున్నారు. ఫలితంగా ఒక్క కుమార్ ఎంటర్‌ప్రైజెస్‌లోనే ప్రతి నెలా వంద బ్యాగుల మాల్టోడెక్స్‌ట్రిన్ పొడరు అమ్ముడవుతోంది. డెయిరీలు నిర్వహించే వారు పాల సాంద్రతను పరీక్షిస్తున్నారు కానీ.. అవి కల్తీవా, ఒరిజినల్‌వా అనేది చూడడం లేదు. ఇప్పటికే పాల నమూనాలు సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించాం. ఫుడ్‌సేఫ్టీ అధికారులు సైతం పంపించారు'' అని డీఎస్పీ పేర్కొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- ముందుగా ఒకేషనల్ విద్యార్థులకు..
- ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఈనెల 10 నుంచి..
- అన్ని ఏర్పాట్లు చేసిన ఇంటర్ బోర్డు అధికారులు



మాట్లాడుతున్న ఆర్ఐఓ వెంకటరమణనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ విద్యార్థులకు బుధవారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ముందుగా ఒకేషనల్ గ్రూపుల విద్యార్థులకు మొదలు కానుండగా, ఈనెల 10 నుంచి ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు జరగనున్నాయి. జిల్లావ్యాప్తంగా ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు 20 కేంద్రాలు, జనరల్ విద్యార్థుల ప్రాక్టికల్స్‌కు 73 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు మొదటి సంవత్సరం విద్యార్థులు 2,263 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1,751 మంది హాజరు కానున్నారు. మూడు విడతలుగా రోజూ రెండు పూటల ప్రాక్టికల్స్ ఉంటాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగుతాయి. ఎంపీసీ, బైపీసీ ప్రాక్టికల్ పరీక్షలకు మొత్తం 18,591 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ఎంపీసీ విద్యార్థులు 15,584 మంది, బైపీసీ విద్యార్థులు 3,007 మంది ఉన్నారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో..

ప్రతి కేంద్రంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్రయోగాలు చేసే సమయంలో ఎగ్జామినర్, చీఫ్ సూపరింటెండెంట్ తప్ప ఎవరూ ఉండకూడదు. విధుల్లో ఉన్నవారందరూ విధిగా ఐడీ కార్డు ధరించాలి. మార్కుల నమోదు పారదర్శకంగా ఉండాలి. ఏ చిన్న పొరబాటు జరిగినా సంబంధిత ఎగ్జామినర్‌దే బాధ్యత. స్కీమ్ ఆఫ్ వాల్యుయేషన్ ప్రకారమే మార్కులు వేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో మార్కులు పొందుపరిచే సమయంలో కంప్యూటర్ గదిలో ఎగ్జామినర్ మినహా ఎవరూ కనిపించకూడదు. ఎట్టి పరిస్థితుల్లోనూ మార్కులను బహిర్గతం చేయకూడదు. ప్రశ్నపత్రాలు ఉదయం 7.30 నుంచి 8 గంటలలోపు, మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటలలోపు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.

అప్రమత్తంగా ఉండాలి..


ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి సైన్స్ అధ్యాపకులకు మంగళవారం అనంతపురం ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్, ఇంటర్ బోర్డు ఆర్ఐఓ వెంకటరమణనాయక్ తెలిపారు. పరీక్షల సమయంలో ఎగ్జామినర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉండి ఏదైనా పొరబాటు జరిగితే వారిదే బాధ్యత అని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే మూల్యాంకనం చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ శంకరయ్య, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు సాలబాయి, నాగరత్నమ్మ, వెంకటరంగయ్య, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్కుల కోసం మభ్యపెడితే ఫిర్యాదు చేయండి

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు మార్కుల కోసం మభ్యపెడితే నేరుగా తమకు ఫిర్యాదు చేయాలని ఇంటర్ బోర్డ్ ఆర్ఐఓ వెంకటరమణనాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రాక్టికల్స్‌లో మార్కులు వేయిస్తామంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఎవరైనా డబ్బులు వసూళ్లు చేస్తే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. కళాశాలల గుర్తింపు రద్దు చేసేందుకు సిఫార్సు చేస్తామని స్పష్టం చేశారు.

రైతులను ఇంకెన్నాళ్లు మభ్యపెడతారు?

- వైఎస్సార్ సీపీ 'ఉరవకొండ' సమన్వయకర్త విశ్వ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకంపై ఊకదంపుడు ఉపన్యాసాలతో ఇంకెన్నాళ్లు రైతులను మభ్యపెడతారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమయన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం వజ్రకరూరు మండలం గంజికుంటలో విలేకరులతో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ చలువతోనే జిల్లాకు కృష్ణా జలాలు వస్తున్నాయన్నారు. గత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో రూ. 6,500 కోట్లతో ఆరు వేల క్యూసెక్కుల మేర నీటిని తరలించడానికి, కాలువ వెడల్పు పనులకు అనుమతులు ఇస్తూ జీఓలు జారీ చేశారన్నారు. 'గాలేరు-నగరి' ద్వారా వైఎస్సార్, చిత్తూరు జిల్లాలకు నీరు మళ్లించడానికి రూ.2,500 కోట్లతో పనులు ప్రారంభించారన్నారు. కూటమి ప్రభుత్వం ఆ జీఓలన్నింటినీ రద్దు చేసిందని, మొదటి దశ కాలువ వెడల్పు పనులు చేయకుండా రెండో దశ లైనింగ్ పనులకు శ్రీకారం చుట్టిందని దుయ్యబట్టారు. మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా డిస్ట్రిబ్యూటరీ పనులతో పాటు పిల్లకాలువ పనులను పూర్తి చేయించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే రాగులపాడు నుంచి వజ్రకరూరు, గుంతకల్లు మండలాల్లోని చెరువులకు కృష్ణా జలాలను అందించడానికి రూ. 20 కోట్లతో టెండర్లు పిలిచారని, వెంటనే పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. హంద్రీ-నీవా ద్వారా 80 వేల ఎకరాలకు సాగు నీరు ఇవ్వడంతో పాటు జీడిపల్లి రిజర్వాయర్ బాధితులకు పరిహారం అందించాలన్నారు. రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, కంది కొనుగోలులో నిబంధనలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, చాబాల సర్పంచు మల్లెల జగదీష్, జేసీఎస్ కన్వీనర్ ఉస్మాన్, మాజీ సర్పంచు ఆవుల వెంకట్రాముడు, మాజీ ఎంపీటీసీ రామాంజినేయులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రవికాంతరెడ్డి, సీనియర్ నాయకులు వీరప్ప, భాస్కర్, సుధాకర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నుంచి ఐదుగురి సస్పెన్షన్

అనంతపురం కార్పొరేషన్: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఐదుగురిని వైఎస్సార్ సీపీ నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు పార్టీ అధ్యక్షుల ఆదేశానుసారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. సస్పెండ్ అయిన వారిలో భూమిరెడ్డి మహానందరెడ్డి (ప్రసన్నాయపల్లి, రాప్తాడు), మద్దిరెడ్డి శివారెడ్డి (అనంతపురం రూరల్), బోయ నరేంద్ర అలియాస్ రాజారాం (ముద్దినేనిపల్లి, కళ్యాణదుర్గం మండలం), పొట్టే రమేష్ (కుంటిమద్ది, రామగిరి మండలం), కురుబ ముత్యాలు (నసనకోట, రామగిరి మండలం) ఉన్నారు.

క్లుప్తంగా

ఉపాధి పనుల తనిఖీ


కూలీలతో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి, శ్రీపురం గ్రామాలలో చేపట్టిన ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో రాష్ట్ర విజిలెన్స్ అధికారి హర్షవర్ధన్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, డ్వామా ఏపీడీ విజయకుమార్, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఏపీఓ మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శి సుమలత ఉన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని సచివాలయాలలో ఉపాధి కూలీలతో సమావేశమై మాట్లాడారు. ఉపాధి సిబ్బంది ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పనులకు వెళ్లకుండా మస్టర్లలో పేర్లు నమోదు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి


మంజు(ఫైల్)

రాయదుర్గం టౌన్: ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం భూపసముద్రం గ్రామానికి చెందిన గొల్ల మంజు(23), చిత్రలింగ, మంజునాథ.. శివమాల ధరించారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై రాయదుర్గానికి వచ్చి పూజా సామగ్రి కొనుగోలు చేసుకుని సాయంత్రం 5 గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. స్థానిక ఎంపీఐ కార్యాలయం సమీపంలోకి చేరుకోగానే స్పీడ్ బ్రేకర్ వద్ద ద్విచక్ర వాహన వేగాన్ని నియంత్రించారు. అదే సమయంలో వేగంగా వెనుకనే వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఘటనలో మంజు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన చిత్రలింగ, మంజునాథను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. మద్యం మత్తులో ట్రాక్టర్‌ను అతి వేగంగా నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ ఉడాయించాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి దుర్మరణం

అనంతపురం సిటీ: స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలోని రైలు పట్టాలపై ఓ గుర్తు తెలియని యువకుడి(30) మృతదేహాన్ని మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి తమిళనాడులోని విల్లుపురం జిల్లా తాచూరు గ్రామానికి చెందిన మనికండ్(30)గా గుర్తించారు. తిరుపతిలోని ఓ హోటల్‌లో కార్మికుడిగా పని చేసే మణికండ్ అనంతపురానికి ఎందుకు వచ్చాడో తెలియాల్సి ఉంది. అతని వద్ద కనీసం రైలు టిక్కెట్ కూడా లేదు. రైలు నుంచి జారి పడ్డాడా లేక రైలు ఢీకొని మృతి చెందాడా అనే కోణంలో రైల్వే పోలీసులు విచారణ చేపట్టారు. సమాచారాన్ని తమిళనాడు పోలీసులకు చేరవేశామని, రక్త సంబంధీకులు సాయంత్రానికి అనంతపురానికి చేరుకోగా, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

పచ్చ నేత.. ఉపాధి మేత!

- నేమ్ బోర్డుల పేరిట రూ.లక్షల స్వాహా
- ఉపాధి ఈసీ భార్య ఖాతాలోకి రూ.7 లక్షలు
- డ్రై ల్యాండ్ హార్టికల్చర్‌లోనూ చేతివాటం
- బీడుభూములకు సైతం బిల్లులు
- చోద్యం చూస్తున్న అధికారులు


బ్రహ్మసముద్రం మండలం సూగేపల్లిలో వృథాగా పడి ఉన్న ఉపాధి పనుల నేమ్ బోర్డులు


కోనాపురంలో లక్ష్మీదేవికి చెందిన పొలం బీడుగా ఉన్న దృశ్యం


ఓంకారమ్మ పొలంలో సాగులో ఉన్న వేరుశనగ పంట

కళ్యాణదుర్గం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీడీపీ నేతల అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. సంపద సృష్టిస్తామని చెబుతూనే పేదల ఉపాధిని కొల్లగొట్టేస్తున్నారు. ఉపాధి పనులు చేయకుండానే బిల్లులు చేసుకోవడం, కూలీలకు చెందాల్సిన సొమ్ము సొంత ఖాతాలోకి బదలాయించుకోవడం, పనుల వివరాలు తెలిపే బోర్డులు పెట్టకుండానే బిల్లులు తీసుకోవడం.. ఇలా ఉపాధిహామీ పథకంలో టీడీపీ నాయకులు అక్రమాలకు పాల్పడ్డారు. పచ్చ దోపిడీకి కొందరు ఉపాధి అధికారులు, సిబ్బంది వత్తాసు పలుకుతుండడం విశేషం.

నేమ్ బోర్డుల పేరిట రూ.లక్షలు స్వాహా

కళ్యాణదుర్గం నియోజకవర్గం బ్రహ్మసముద్రం మండలంలో ఉపాధి హామీ పథకంలో పనుల వివరాలను తెలిపే నేమ్ బోర్డులు (శిలాఫలకాలు) పనులు చేసిన ప్రదేశంలో ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ఉపాధి అధికారులు, స్థానిక టీడీపీ నేతల ప్రోద్బలంతో వాటిని ఓ చోట వృథాగా పడేశారు. దీనికి తోడు ఇంజినీరింగ్ కన్సల్ట్ (ఈసీ)గా విధులు నిర్వర్తిస్తున్న జయప్రకాష్ తన భార్య పందల ప్రతిభ ఎస్‌బీఐ ఖాతాకు (32366005110) ఏకంగా బ్రహ్మసముద్రం మండలంలోని 16 గ్రామ పంచాయతీల నేమ్ బోర్డులకు సంబంధించి రూ.7,52,800 నగదును బదలాయించుకున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి పథకంలో ఈసీ భార్య పేరిట బ్యాంక్ ఖాతాలోకి జమ చేసుకోవడం పలు విమర్శలకు తావిస్తోంది. దీనిపై కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో ఈసీని టీఓసీ (టెంపరరీ అవుట్ ఆఫ్ కాంటాక్టు) కింద ఉపాధి ఉన్నతాధికారులు ఉంచి చేతులు దులుపుకున్నారు.

> **చోద్యం చూస్తున్న 'ఉపాధి' అధికారులు**
>
> బ్రహ్మసముద్రం మండలం వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలపై పక్కా ఆధారాలున్నా చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రికార్డులను తారుమారు చేసి రైతుల పేరిట టీడీపీ నాయకులు వారి బ్యాంకు ఖాతాలకు నిధులు బదలాయించుకుంటున్నా అధికారులు నోరు మెదప లేదు. ఈ అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు లేకపోవడం గమనార్హం. దీనిపై బ్రహ్మసముద్రం మండలం ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ నందకిషోర్‌ను 'సాక్షి' వివరణ కోరేందుకు ప్రయత్నించగా తాను మీటింగ్‌లో ఉన్నానని చెప్పి ముఖం చాటేశారు.

బీడు భూములకు సైతం బిల్లులు

డ్రై ల్యాండ్ హార్టికల్చర్‌లోనూ ఉపాధి సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. కోనాపురానికి చెందిన జి.లక్ష్మీదేవి పొలంలో డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద మామిడి మొక్కలు నాటినట్లు రికార్డుల్లో చూపించారు. అయితే ఆ పొలం బీడుగా ఉంది. ఈమె పేరిట రూ.38,954 బిల్లును అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గొల్ల ఎర్రిస్వామి బ్యాంక్ ఖాతాకు బదలాయించినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఇదే గ్రామానికి చెందిన ఓంకారమ్మ తన పొలంలో వేరుశనగ పంట సాగు చేసింది. అయితే ఈ పొలంలో మామిడి మొక్కలు నాటినట్లు రికార్డులు చూపించి, గొల్ల ఎర్రిస్వామి బ్యాంకు ఖాతాకు ఏకంగా రూ. 45,197లు మళ్లించారు. బతుకు తెరువు కోసం కర్ణాటకకు వలస వెళ్లిన నాగేంద్ర ప్రసాద్, సత్యనారాయణ పొలాల్లో డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద మామిడి సాగు చేపట్టినట్లు రికార్డులు సృష్టించి నామా ప్రశాంతి బ్యాంకు ఖాతాకు సుమారు రూ.88 వేలకు పైగా నిధులు బదలాయించారు.

కడుపుబ్బరంతో గొర్రెల మృతి


కందిచేనులో మృతి చెందిన జీవాలు

రాయదుర్గం టౌన్: మండలంలోని జుంజురాంపల్లిలో మంగళవారం సాయంత్రం ఓ కంది చేనులో మేత మేసి నీరు తాగిన వెంటనే కడుపు ఉబ్బరంతో దాదాపు 12 గొర్రెలు, మేకలు మృత్యువాత పడ్డాయి. సమాచారం అందుకున్న పశు వైద్య సిబ్బంది సకాలంలో అక్కడకు చేరుకుని వైద్యం అందించడంతో మరో 22 జీవాలు ప్రాణపాయం నుంచి బయటపడ్డాయి. పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి తెలిపిన మేరకు... గ్రామంలోని కందిచేనులో మేసి నీరు తాగి దాదాపు 34 గొర్రెలు ఇబ్బందులు పడుతున్నట్లు కాపరులు సమాచారం అందించడంతో వైద్య సిబ్బంది తాహిర్, వీరేష్, కళ్యాణి చేరుకుని వైద్య చికిత్సలు మొదలు పెట్టారు. అప్పటికే మొత్తం 12 గొర్రెలు మృతి చెందాయి. వీటిలో మారెన్నకు చెందిన 4 గొర్రెలు, రాజుకు చెందిన 4 మేకలు, మారన్నకు చెందిన ఓ గొర్రె ఉంది. 12 జీవాల మృతితో దాదాపు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లింది.

కార్నియా మార్పిడి కేంద్రంగా మారాలి : కలెక్టర్


నేత్ర స్వీకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

అనంతపురం మెడికల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అనంతపురంలోని పాతూరు సీడీ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన డీవై కుళ్లాయప్ప నేత్ర స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేవలం కార్నియా సేకరణకు పరిమితం కాకుండా త్వరలో కార్నియా మార్పిడి కేంద్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కంటిదాన అంగీకార పత్రాల సేకరణలోనూ రెడ్‌క్రాస్ ముందుండాలన్నారు. నేత్రదాన అంగీకారం తెల్పడానికి యువత ముందుకురావాలన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ పొందిన ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌ను కమిటీ సభ్యులకు కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రెడ్‌క్రాస్ మేనేజింగ్ సభ్యుడు కాపు రామచంద్రారెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్‌పర్సన్ కాపు భారతి, జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ అక్బర్ సాహెబ్, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

నూర్పిడి మిషన్‌కు తగిలి మహిళా కూలీ మృతి


మృతురాలు అరుణ

బొమ్మనహాళ్: మండలంలోని నక్కలపల్లి వద్ద పప్పుశనగ పొలంలో మంగళవారం నూర్పిడి చేస్తున్న మిషన్‌కు చీర చుట్టుకుని కూలీ చాకలి అరుణ(35) మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... పప్పుశనగ పంటను నూర్పిడి చేస్తుండగా అరుణ చీర మిషన్‌కు చుట్టుకోవడంతో బలంగా యంత్రాన్ని ఢీకొని తీవ్రంగా గాయపడింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను కుటుంబసభ్యులు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆమె మృతిచెందింది. మృతురాలికి భర్త వెంకటేశులు, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

హంద్రీ-నీవా కాలువను వెడల్పు చేయాల్సిందే

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


హెచ్ఎన్ఎస్ఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: హంద్రీ-నీవాను ఓటు బ్యాంక్ కోసం వాడుకుని అధికారం చేపట్టిన తర్వాత నిర్వీర్యం చేసే కుట్రకు సీఎం చంద్రబాబు తెరలేపారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మండిపడ్డారు. హంద్రీ-నీవా కాలువను వెడల్పు చేసేంత వరకూ తమ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. హంద్రీనీవా కాలువను వెడల్పు చేయాలంటూ మంగళవారం హెచ్ఎన్ఎస్ఎస్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆందోళనకు అఖిలపక్షం నేతలు మద్దతు తెలిపారు. రామకృష్ణ మాట్లాడుతూ.. కాలువలో నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పది వేల క్యూసెక్కులకు పెంచి ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు. 30 లక్షల మందికి తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేస్తున్నామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప, మానవహక్కుల సంఘం నాయకులు బాషా, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాగరాజు, సీపీఐ శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, కార్యదర్శి వర్గ సభ్యుడు రాజారెడ్డి, కేశవరెడ్డి, శ్రీరాములు, రామకృష్ణ, వీరభద్రస్వామి, రైతు సంఘం అధ్యక్షుడు చెన్నప్పయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క హామీనైనా అమలు చేశారా బాబూ?

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతగా ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదానినైనా అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చారా బాబూ? అంటూ సీఎం చంద్రబాబును సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రశ్నించారు. నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు వద్దని ఇప్పుడు ఏర్పాటుకు సిద్ధం కావడం సిగ్గుచేటన్నారు. సోమవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. రాష్ట్రానికి రూ.3 లక్షల కోట్ల ఆర్థిక సాయం అందించామని బహిరంగ సమావేశంలో కేంద్ర అమిత్‌షా చెప్పారన్నారు. అయినా రైతులకు పంట పెట్టుబడి కింద రూ.20 వేలు ఇవ్వలేదన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయలేదన్నారు. పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు 135 అడుగులకు మాత్రమే పరిమితం చేస్తూ నిధులు మంజూరు చేస్తామని కేంద్రం కచ్చితంగా చెప్పినా కూటమి పెద్దలు నోరెత్తడం లేదని విమర్శించారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. వీటన్నిటిపై పోరాటానికి సీపీఐ శ్రేణులు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, మతోన్మాదంపై మార్చి 23 నుంచి ఏప్రిల్ 14 వరకు దేశవ్యాప్తంగా చేపడుతున్నా కార్యక్రమాల్లో ప్రతి కార్యకర్త పాల్గొనడమే కాకుండా ప్రజలను భాగస్వాములను చేయాలని కోరారు.

అమళ్లదిన్నెకు సతీవియోగం

- వైద్య కళాశాలకు దేహదానం


జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావుకు మృతదేహాన్ని అప్పగిస్తున్న కవి అమళ్లదిన్నె

అనంతపురం కల్చరల్/మెడికల్: జిల్లా సాహిత్యంలో పద్యకవిగా, అష్టావధానిగా పేరు గాంచిన అమళ్లదిన్నె వేంకటరమణ ప్రసాద్‌కు సతీ వినియోగం కలిగింది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన భార్య సుజాత (74) మంగళవారం కన్నుమూశారు. దీంతో ఆమె శరీరాన్ని వైద్య కళాశాలకు ఆయన అప్పగించారు. మతదేహాన్ని మట్టిలో కలసిపోకుండా, వైద్య విద్యార్థుల జ్ఞానానికి ఉపయోగపడేలా తన మరణానంతరం వైద్య కళాశాలకు అప్పగించాలన్న సుజాత కోరికను భర్త గౌరవించడం గొప్ప విషయమని ఈ సందర్భంగా వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అనాటమీ విభాగాధిపతి ఉమామహేశ్వరావు, అధ్యాపకులు నరేంద్ర నాయక్, పద్మజ, సహజీర్, పున్వీజన్ కుమార్, భాను పాల్గొన్నారు.

సంతాపం తెలిపిన పలువురు

జిల్లాలోనే ఆచార వ్యవహారాలు అధికంగా పాటించే అమళ్లదిన్నె కుటుంబీకులు... వైద్య విద్యార్థుల కోసం దేహదానం చేసి స్ఫూర్తిదాయకంగా నిలిచారని జిల్లా సాహితీవేత్తలు అన్నారు. ఆయన తీసుకున్న నిర్ణయం ఎంతో మందికి ఆదర్శప్రాయంగా నిలుస్తుందని కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. తెలుగు వెలుగు టీవీరెడ్డి, పూజారి ఈరన్న, జిల్లా రచయితల సంఘం జన్నె ఆనంద్, సాహిత్యభారతీ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, డాక్టర్ రమేష్ నారాయణ, డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీసమితి అధ్యక్షుడు రియాజుద్దీన్, చం.శాస్త్రి, షరీఫ్ తదితరులు సంతాపం తెలిపారు. అలాగే జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్ తండ్రి బోయ కొండన్న కూడా ఇదే రోజు కన్నుమూయడంతో సాహితీ సంస్థల ప్రతినిధులు తమ సంతాపాన్ని తెలిపారు.

దోబీ ఘాట్‌లో అగ్నిప్రమాదం

వజ్రకరూరు: మండల కేంద్రం సమీపంలోని దోబీ ఘాట్‌లో మంగళవారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. స్థానిక రజకులు గ్రామస్తుల దుస్తులను ఘాట్ వద్ద ఉతికి ఆరబెట్టారు. ఆ సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి దుస్తులకు వ్యాపించాయి. రెండు వేల చీరలు, అంగీలు, బనియన్లు, పంచలు, 30 పైపులు, 10 డ్రమ్ములు కాలిపోయాయి. అటుగా వెళుతున్న కొందరు గమనించి సమాచారం ఇవ్వడంతో రజకులు అక్కడకు చేరుకుని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న ఉరవకొండ అగ్నిమాపక శాఖ అధికారులు అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. ఘటనతో రూ.6 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు రజకులు తెలిపారు. స్థానిక సర్పంచ్ మోనాలిసా, పోలీసులు, వీఆర్వోలు మారెన్న, భరత్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాలకు వేళాయె



బుక్కరాయసముద్రం: భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న కొండమీదరాయస్వామి ఉత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సాయంత్రం బుక్కరాయసముద్రం లక్ష్మీ నారాయణస్వామి దేవాలయం నుంచి ఉత్సవ మూర్తులను కొండపైకి తీసుకెళ్లనున్నారు. 6న ఉదయం 8 గంటలకు దేవరకొండపై ఉత్సవ విగ్రహాలకు పుణ్యాహవాచనము, అంకురార్పణ, దేవతా హోమాలు, ధ్వజారోహనం, గరుడ ఆహ్వాన పూజ నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి 8 గంటలకు పుష్ప పల్లకీ సేవ, 7న రాత్రి 8 గంటలకు సింహ వాహన, 8న శేష వాహన, 9న హనుమ, 10న గరుడ, 11న శ్వేత గజ వాహన సేవలు ఉంటాయి. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన శ్రీవారి రథోత్సవం ఈ నెల 12న జరగనుంది. ఆ రోజు వేకువ జామున 4 గంటలకు కల్యాణ మహోత్సవం ఉంటుంది. అనంతరం ఉదయం 11.30 గంటలకు సూర్యప్రభ వాహనంపై పురవీధులలో ఊరేగిస్తారు. సాయంత్రం రథోత్సవం ఉంటుంది. 13న స్వామి వారిని అశ్వవాహనంపై ఊరేగిస్తారు. 14న తీర్థవాది వసంతోత్సవం, హంస వాహన సేవలు ఉంటాయి.

భక్తులతో పోటెత్తిన బూదగవి


దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఉరవకొండ: రాష్ట్రంలోనే రెండో సూర్యదేవాలయంగా ఖ్యాతిగాంచిన బూదగవి సూర్యదేవాలయం రథసప్తమి సందర్భంగా భక్తులతో పోటెత్తింది. జిల్లా నలమూలల నుంచే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి దర్శనం కోసం వేకువ జామునుంచే భక్తులు బారులు తీరారు. తెల్లవారుజామున ఆలయంలో విశేష అభిషేకాలు, అలంకరణలు జరిగాయి. కలశ ప్రతిష్ట మహాగణపతి, నవగ్రహ హోమాలు నిర్వహించారు. అనంతరం ఛాయ, ఉష సమేత సూర్యనారాయణస్వామి కల్యాణోత్సవాన్ని వేదమంత్రోచ్చారణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు.

ప్రశ్నించే గొంతుకను నొక్కుతారా?


ఎండోమెంటు కార్యాలయం వద్ద మాట్లాడుతున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: సమాజంలో అందరూ బాగుండాలని ఆశీర్వ వచనాలు పలికే అర్చకుల సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధించడం సరికాదని అర్చక పురోహితులు మండిపడ్డారు. ఎండోమెంటు సహాయ కమిషనర్ ఆదిశేషు నాయుడు విధానాలను తప్పుబడుతూ ప్రభుత్వ తీరుపై మంగళవారం జిల్లా అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో పలువురు అర్చకులు, పురోహితులు ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు మాట్లాడుతూ.. ఎండోమెంటు అధికారుల నిర్లక్ష్యాన్ని, అవినీతిని ఎండగడుతూ గత నెల 22న ధర్నా చేశామని గుర్తు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారన్నారు. ఈ విచారణ మంగళవారం జరగాల్సి ఉండగా... ఇతర పనుల ఒత్తిడి వల్ల విచారనాధికారి హాజరు కాలేకపోయారన్నారు. దీంతో వారం రోజుల అనంతరం డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ సాగుతుందని తెలిపారు. ఈ లోపు విడపనకల్లు మండలం పాల్తూరులో వెలసిన బండ వీరభద్రస్వామి ఆలయ అర్చకులను ఎండోమెంటు కార్యాలయానికి ఏసీ పిలిపించుకుని రెచ్చగొట్టి కేసులు బనాయించడం దారుణమన్నారు. ఏసీ దౌర్జన్యాలపై తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య ఉమ్మడి జిల్లా నాయకులు శ్రీనివాసులు, తిరుపతయ్య, వీరాంజనేయులు, హనుమంతరాయుడు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వసతి.. అధోగతి!

- వలస గ్రామాల్లో కనిపించని ప్రత్యామ్నాయ చర్యలు
- పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థుల హాజరు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం


రాయదుర్గం సమీపంలోని గోనబావిలో వలస వెళ్లడంతో ఇంటికి వేసిన తాళం

జిల్లాలో పాఠశాలలు	2,417
మొత్తం విద్యార్థులు	2,01,648
డ్రాపౌట్	3,224

రాయదుర్గం: తల్లిదండ్రులు వలసబాట పడితే.. పిల్లలు చదువులు మానేసి వారి వెంటే వెళ్లే పరిస్థితి జిల్లాలో నెలకొంది. కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లో ఈ దుస్థితి మరీ ఎక్కువగా ఉంది. అలాంటి విద్యార్థుల భవిష్యత్తు కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీజనల్ వసతి గృహాలు ఏర్పాటు చేసి డ్రాపౌట్స్ నిర్మూలనకు చర్యలు చేపట్టింది. తల్లిదండ్రులు వలస వెళ్లినా, పిల్లల చదువులకు ఆటంకం కలగకుండా ఉండేందుకు జిల్లాలో సుమారు 69 హాస్టళ్లు అందుబాటులోకి తెచ్చింది. రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోనే 20 హాస్టళ్లకు పైగా నెలకొల్పింది.

గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం..

గత ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టళ్లను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. ఫలితంగా పాఠశాలల్లో డ్రాపౌట్స్ సంఖ్య పెరుగుతోంది. గుమ్మఘట్ట, డీ హీరేహాళ్, బ్రహ్మసముద్రం, కుందుర్పి, కంబదూరు, శెట్టూరు ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొనడంతో వందల కుటుంబాలు వలసబాట పట్టాయి. గుమ్మఘట్ట మండలం గోనబావి, పూలకుంట, జే వెంకటంపల్లి గ్రామాల్లో 70 శాతం ఇళ్లకు తాళాలు పడ్డాయి. వీధులన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేసి పేద కుటుంబాలకు చేయూతనివ్వాల్సిన ప్రభుత్వం ఆ విషయమే పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతి 50 మందికి ఓ హాస్టల్

జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 2, 417 ఉన్నాయి. ఇందులో సుమారు 2,01,648 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా స్కూళ్లలో ఇప్పటివరకూ 3,224 మంది విద్యార్థులు బడికి వెళ్లడం లేదని తెలిసింది. భవిష్యత్తులో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. గతంలో ప్రతి 50 మంది విద్యార్థులకు ఒక సీజన్ హాస్టల్ ఏర్పాటు చేశారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన కుటుంబాల పిల్లలకు ఎంతో ప్రయోజనం చేకూర్చారు. మధ్యాహ్నం, రాత్రి వేళ ఉచితంగా నాణ్యమైన భోజనం అందించారు. సర్వశిక్ష అభియాన్ సహకారంతో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వీటిని నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల మేరకు 200కు పైగా సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

> **ప్రతిపాదనలు పంపిస్తాం**
>
> గత రెండేళ్లుగా జిల్లాలో ఎక్కడా సీజనల్స్ హాస్టళ్లు ఏర్పాటు చేయలేదు. జిల్లాలో వాటి అవసరాలు గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. పాఠశాలల్లో డ్రాపౌట్స్ సంఖ్య తగ్గించేలా కృషి చేస్తున్నాం. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.
>
> – ప్రసాద్‌బాబు, డీఈఓ, అనంతపురం

క్లుప్తంగా

జగన్‌ను కలిసిన 'జ్వాలాపురం'



వైఎస్ జగన్‌తో జ్వాలాపురం శ్రీకాంత్

అనంతపురం కల్చరల్: దేవదాయ శాఖ మాజీ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లి క్యాంపు ఆఫీసులో కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎన్నో విషయాల్లో బ్రాహ్మణులకు పెద్దపీట వేసిందని ప్రస్తుతం అందుకు భిన్నంగా జరుగుతోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో బ్రాహ్మణ, అర్చక, పురోహితుల సమస్యలపై పోరాటం చేస్తామని వెల్లడించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



సుబ్బారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: వడ్డుపల్లి గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి(45) మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి వద్దకు చేరుకొని సుబ్బారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుబ్బారెడ్డి సేవలు మరువలేనివన్నారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్యపడొద్దు అండగా ఉంటామని భరోసా కల్పించారు. వడ్డుపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ ఓబిరెడ్డి, వైఎస్సార్‌సీపీ వలంటీర్ విభాగం అధ్యక్షుడు ఓబుగారి హరినాథ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మార్కెట్ వేలం వాయిదా

అనంతపురం కార్పొరేషన్: కూరగాయల సంత మార్కెట్ వేలం పాట వాయిదా పడింది. మటన్ మార్కెట్ కాంట్రాక్ట్‌కు నలుగురు పోటీ పడగా, చివరకు ఓ పాటదారుడు దక్కించుకున్నాడు. మంగళవారం నగరపాలక సంస్థలోని రెవెన్యూ కార్యాలయంలో కూరగాయల సంత మార్కెట్, మటన్ మార్కెట్ వేలం పాటను డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు నిర్వహించారు. సంత మార్కెట్‌కు ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో సర్కార్ సవాల్ రూ.88 లక్షలు నిర్ధారించగా, అందుకు పాటదారులు ముందుకురాలేదు. అందరూ ఒకే మాటపై రేటు తగ్గించాలంటూ అధికారులకు విన్నవించారు. దీంతో డిప్యూటీ కమిషనర్ సరైన పాట రాలేదని, ఈ నెల 11వ తేదీకి కూరగాయల సంత మార్కెట్‌ను వేలం వేస్తున్నట్లు ప్రకటించారు. మటన్ మార్కెట్‌కు సంబంధించి నలుగురు పోటీ పడ్డారు. సర్కార్ సవాల్ రూ.5.18 లక్షలుగా నిర్ణయించగా, బీ అలీం అనే పాటదారుడు రూ.6.8 లక్షలకు దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓలు సుజాత, విజయ్‌కుమార్, ఆర్‌ఐలు రఘునాథ్‌రెడ్డి, పెద్దక్క, రజాక్, చంద్రశేఖర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

'లక్ష డప్పులు.. వేల గొంతులు'కు తరలిరండి

అనంతపురం టవర్‌క్లాక్: మందకృష్ణ ఆధ్వర్యంలో ఈనెల7న హైదరాబాద్‌లో లక్ష డప్పులు వేల గొంతులు పేరుతో తలపెట్టిన కార్యక్రమానికి మాదిగలు తరలిరావాలని ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ కోరారు. మంగళవారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమానికి మాదిగలు డప్పులతో రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, అమర్‌నాథ్, కదిరప్ప, చంద్రశేఖర్, నాగభూషణం, రమేష్, నరసింహులు, ఓబులేసు, నాగరాజు, కుళ్లాయప్ప, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం టవర్‌క్లాక్: మందకృష్ణ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యాక్రమానికి మాదిగలు తప్పెట్లతో తరలిరావాలని బీసీ ఆర్ దాస్ కోరారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీసీఆర్ దాస్ మాట్లాడుతూ మందకృష్ణ హైదరాబాద్‌కు వెళ్లే మాదిగలకు డప్పులు పంపిణీ చేశామన్నారు.

కందుల కొనుగోలులో తమ్ముళ్ల పెత్తనం



- తమకు అనుకూలంగా ఉన్న వారికే పెద్దపీట
- నిబంధనల పేరుతో ఇబ్బందులు
- అధికార పార్టీ నేతలపై రైతుల ఆగ్రహం
- వ్యవసాయ సిబ్బందికి సమాచారం ఇవ్వని వైనం
- పక్షం రోజులైనా రైతుల ఖాతాల్లో పడని కందుల సొమ్ము

ఆత్మకూరు: ఎండనక, వాననక ప్రతి రైతూ చమటోడ్చి పంటను పండిస్తాడు. అలాంటి పంట కొనుగోలులోనూ అధికార పార్టీ నాయకులు 'పచ్చ' పాతం చూపించడంపై రైతులు భగ్గుమంటున్నారు. మండలంలో ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంటను కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో తమకు న్యాయం జరుగుతుందని రైతులు భావించారు. అయితే అధికార పార్టీ నాయకుల జోక్యంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మండల వ్యాప్తంగా 9211 ఎకరాల్లో కంది పంటను సాగు చేశారు. క్వింటాకు రూ.7550 ధర నిర్ణయించి ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా కందులను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 63.45 క్వింటాళ్లను కొనుగోలు చేశారు. పక్షం రోజులకే కందుల నగదు మొత్తం రైతుల ఖాతాలకు జమ చేస్తామని అధికారులు ప్రకటించారు. అయితే కందులు కొనుగోలు చేసి 3 వారాలు గడిచినా ఇంత వరకు అతీగతీలేదు.



కందుల కొనుగోలును ప్రారంభిస్తున్న తహసీల్దార్ లక్ష్మీనాయక్(ఫైల్)

రైతులకు తప్పని ఇక్కట్లు



మండలంలోని చాలా మంది రైతులు పంటను అమ్ముకోవడానికి వస్తే అక్కడున్న టీడీపీ నేతలు మీ కందులు సరిగా లేవు. జల్లెడ పట్టాలి. తేమ శాతం ఎక్కువగా ఉంది, ఆరబెట్టుకొని రండి అంటూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మరోవైపు టీడీపీకి చెందిన వ్యక్తులు కందులను తీసుకెళ్తే దుమ్ము, పుల్లలు ఉన్నా, శుభ్రంగా లేకపోయినా జల్లెడ పట్టకుండా తీసుకుంటున్నారు. దీంతో రైతులు అంటే అందరూ కదా.. రాజకీయం వేరు రైతులు వేరు..ఇలా పండించిన పంటల్లో కూడా రాజకీయం చూపిస్తే ఎలా బతకాలి అని చాలా మంది రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అంతేకాకుండా కందులు కొనుగోలు చేయాలంటే వ్యవసాయ అధికారులు కంది పంటను ఈ క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసి ఉండాలి. కాని ఈ క్రాప్ చేయించని అధికార పార్టీ నేతలకు చెందిన కొంత మందికి సంబంధించి కందులను కూడా కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో రైతులు ఒక్కొక్కరికి ఒక్కో న్యాయమా అంటూ వాపోతున్నారు. అంతేకాకుండా తూకాల్లో కూడా ఏదో తేడా వస్తోందని తాము తూకాలు వేసే యంత్రాలు తెస్తామన్నా మా దగ్గర ఉన్న వాటితోనే తూకాలు వేస్తామని అక్కడున్న వారు వినడం లేదని రైతులు చెబుతున్నారు. తూకం కరెక్టుగా ఉంటే ఏ తక్కెడ అయితే ఏం తాము తెస్తే ఎందుకు వద్దంటారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ అధికారులకు సమాచారమే లేదా ?



కందుల కొనుగోలులో వ్యవసాయ సిబ్బందిదే ముఖ్య పాత్ర. అయితే ఇక్కడ మాత్రం వారికి సమాచారమే లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు వారాల క్రితం తహసీల్దార్ లక్ష్మీనాయక్ కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అయితే ఏ గ్రామంలో ఎన్ని ఎకరాలు ఈ క్రాప్ చేశారన్న విషయం ఒక్క వ్యయసాయ సిబ్బందికే తెలుస్తుంది. కాని కందుల కొనుగోలు విషయంలో పూర్తిగా వ్యవసాయ సిబ్బందిని దూరం పెట్టినట్లు తెలుస్తోంది. జిల్లా వ్యవసాయాధికారులు స్పందించి తమకు అన్యాయం జరగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



హౌసింగుబోర్డులో శ్రీనివాసుడి ఊరేగింపు

అనంతపురం కల్చరల్: నగరంలోని పలుఆలయాల్లో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో ఉదయం చిన్నారుల చేత సామూహిక యోగా చేయించారు. టీటీడీ ప్రతినిధులు పండిట్ వేణు, బాబు రథసప్తమి విశిష్టత తెలియజేసి, సామూహిక ఆదిత్యహృదయ పారాయణం చేయించారు. స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ అన్నపూర్ణేశ్వరి ఆలయంలో బసవరాజ స్వామి నేతృత్వంలో శివపార్వతుల కల్యాణం కమనీయంగా సాగింది. ఆర్‌ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం, హౌసింగుబోర్డు వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. దేవరకొండ కౌసల్య ఆధ్వర్యంలో భక్తిగీతాలతో నగరోత్సవం కనులపండువగా సాగింది. మారుతీ నగర్ కోదండరామాయం, మొదటిరోడ్డులోని కాశీ విశ్వేశ్వరకోదండరామాలయం, శివబాలయోగి ఆశ్రమం, శివకోటి తదితర చోట్ల రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి.

'సమాచారం' సరి చేశారు



సమాచార హక్కు చట్టం బోర్డులో మారిన పేర్లు

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడు: మండలంలోని పలు గ్రామ సచివాలయాల వద్ద సమాచార హక్కు చట్టం బోర్డుల్లో అధికారుల పేర్లను ఎట్టకేలకు మార్చారు. ఈఓఆర్డీగా మాధవి, ఎంపీడీఓ సాల్మన్, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. అయినా పాత అధికారుల పేర్లు ఉండటంపై 'అధికారులు మారినా...సమాచారం మార్చరా' శీర్షికన జనవరి 31న సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఆయా గ్రామ సచివాలయాల కార్యదర్శులు సోమవారం స్పందించి మండలా వ్యాప్తంగా 12 గ్రామ సచివాలయాల దగ్గర సమాచార హక్కు చట్టం బోర్డుల్లో ప్రస్తుతం పని చేస్తున్న అధికారుల పేర్లు ఏర్పాటు చేశారు. సమాచార హక్కు చట్టం బోర్డుల్లో అధికారుల పేర్లు మారడంతో మండల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేసి, సాక్షికి ధన్యవాదాలు తెలిపారు.

కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించాలి



కేన్సర్‌పై అవగాహన ర్యాలీ ప్రారంభించిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి



ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు

- వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు

అనంతపురం మెడికల్: కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్యం అందిస్తే రోగుల జీవిత కాలాన్నీ పెంచవచ్చని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు పేర్కొన్నారు. ప్రపంచ కేన్సర్ దినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆయన ర్యాలీను ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావుతో కలసి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ సర్వైకల్, కాలేయ కేన్సర్ రాకుండా టీకాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఒక్కరూ టీకా తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ధూమపానం, ప్లాస్టిక్ వినియోగం, మితిమీరిన యాంటీ బయాటిక్ మందుల వాడకం కేన్సర్‌కు ప్రధాన కారణమన్నారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ కేన్సర్‌పై అవగాహన కల్పించేందుకు సామాజిక వైద్య శాస్త్ర విభాగం, కేన్సర్ యూనిట్ తరపున ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఆ యూనిట్‌లో కేన్సర్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్, రేడియోథెరపీ హెచ్‌ఓడీ డాక్టర్ సతీష్, అంకాలజిస్టులు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ దినకర్, డాక్టర్ నిహారిక, డాక్టర్ సుమన గోపిచంద్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఎస్ఎస్ పీఓ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీ నాయుడు, పీడీ నరసింహనాయక్, తదితరులు పాల్గొన్నారు.

స్క్రీనింగ్‌తోనే కేన్సర్ నివారణ

అనంతపురం మెడికల్: కేన్సర్ నివారణ కేవలం స్క్రీనింగ్‌తోనే సాధ్యమవుతుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. ప్రపంచ కేన్సర్ దినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని డీఎంహెచ్‌ఓ ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రస్తుతం రొమ్ము, గర్భాశయ, నోటి కేన్సర్లు అత్యధికంగా వ్యాపిస్తున్నాయన్నారు. వీటిని ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే నయమవుతుందన్నారు. ప్రభుత్వం కూడా ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ పరీక్షలు చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. వైద్య సిబ్బందికి ఇంటికి వచ్చి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారన్నారు. డీఐఓ డాక్టర్ యుగంధర్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నారాయణస్వామి, ఆరోగ్యశాఖ సిబ్బంది ఆంజనేయులు, శ్రీరాములు, ప్రేమ్, కిషోర్, మానిక, శశికళ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

రాప్తాడురూరల్: ఆత్మకూరు మండలానికి చెందిన ఓ యువతి అనంతపురం రూరల్ మండలం పిల్లిగుండ్లకాలనీలో అదృశ్యమైంది. తన పెద్దమ్మ ఇంటికి వచ్చిన యువతి సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి...తిరిగి రాలేదు. బంధువులు చుట్టుపక్కల విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి మంగళవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా బెళుగుప్ప మండలానికి చెందిన ఓ యువకుడితో వెళ్లినట్లు తెలిసింది. ఆ యువకుడిని ప్రేమ వివాహం చేసుకున్నట్లు సమాచారం. దీనిపై పెళ్లి చేసుకున్న యువకుడి స్నేహితుడు యువతి బంధువులకు సమాచారం అందించినట్లు తెలిసింది. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిళ్లు

అనంతపురం ఎడ్యుకేషన్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో 'ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల'పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. పేద వర్గాల పిల్లలు పెద్ద చదువులతో ఇంజినీర్లు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు కావాలంటే ఆర్థిక ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన లక్షలాది మంది పేద పిల్లలు ఈరోజు ఉన్నత స్థానాలతో పాటు దేశవిదేశాల్లో స్థిరపడ్డారని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మరో అడుగు ముందుకేసి మొత్తం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేసేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇంతటి బృహత్తర పథకానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందన్నారు. అనుబంధ సంఘాల అధ్యక్షులు మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యలు విద్యార్థులపై ఒత్తిళ్లు చేస్తున్నాయన్నారు. కోర్సులు పూర్తయినా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. గత ప్రభుత్వంపై నిందలు వేస్తూ కాలం వెల్లదీస్తున్నారన్నారు. ఇప్పటికైనా బకాయిలు చెల్లించి విద్యార్థులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు బి.శ్రీదేవి, సైఫుల్లాబేగ్, మల్లెమీద నరసింహులు, ఓబిరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, చంద్రశేఖర్‌యాదవ్, రిలాక్స్ నాగరాజు, నగర అధ్యక్షులు సాకే చంద్రలేఖ, దత్తరాయల్, బోయ లక్ష్మన్న, విజయ్, సతీష్, కైలాష్, కోనా రాజారెడ్డి, రామయ్య, జయప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పంటలు తొలగించారు..న్యాయం చేయండి

అనంతపురం అర్బన్: ఏళ్లగా ప్రభుత్వభూమిని సాగుచేసుకుంటూ పంటలు పెట్టుకుని జీవనం సాగిస్తున్న పేదలను రోడ్డున పడేస్తున్నారని డీఆర్‌ఓ ఎ.మలోలకు రాప్తాడు వైఎస్ ఎంపీపీ రామాంజినేయులు, బాధితులు ఫిర్యాదు చేశారు. డీఆర్‌ఓని మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో రామాంజనేయులు, బాధితులు కలిసి వినతిపత్రం అందజేసి సమస్య వివరించారు. రాప్తాడు పొలం సర్వే నంబర్లు 213, 223, 241లో ప్రభుత్వ భూమి, వంకపోరంబోకు భూమి దాదాపు 22 ఎకరాల ఉందని, ఇందులో నిరుపేద వాల్మీకులు తమ పూర్వీకులు (దాదాపు 70 ఏళ్లు) నుంచి పదెకరాల్లో మామిడి, జామ, నేరేడు చెట్లు, పశువులకు పచ్చగడ్డి పెట్టుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. మిగిలిన స్థలంలో 100 మంది ఇళ్లను నిర్మించుకుని నివాసముంటున్నారని తెలిపారు. ఇంకా పదెకరాల్లో కంది, జొన్న, తదితర వర్షాధార పంటలు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు ఈనెల 3న వచ్చి స్థలంలో పార్కు నిర్మాణం చేపడతామని సర్వే చేసి అదేరోజు జేసీబీలతో వచ్చి ఉన్నఫలంగా స్థలాలను ఖాళీ చేయించారన్నారు. ఎనిమిదేళ్లుగా పెంచుకున్న చెట్లను అన్యాయంగా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదెక్కడి అన్యాయమంటూ తహసీల్దార్‌ను ప్రశ్నిస్తే పోలీసులను రంగంలోకి దింపు నిరుపేద రైతులను బెదిరిస్తూ బలవంతంగా సాగుచేసిన పంటలను తొలగించారని చెప్పారు. దీనిపై మీరు స్వయంగా విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. బాధితులు బోగం నరసింహులు, సాకే నారాయణస్వామి, మాన్లుకోసే శేఖర్, బోగ్గుల రాముడు, నారాయణ స్వామి, ఆంజనేయులు, తిప్పన్న, లక్ష్మీనారాయణ, ఇళ్లను కోల్పోతున్న వారు ఉన్నారు.



డీఆర్‌ఓకు సమస్య వివరిస్తున్న వైస్ ఎంపీపీ రామాంజినేయులు, బాధితులు

మొహియుద్దీన్ నేటి తరానికి ఆదర్శం



మొహియుద్దీన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యమశీల మగ్దూం మొహియుద్దీన్ నేటి తరానికి ఆదర్శమని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు కొనియాడారు. మంగళవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో మొహియుద్దీన్ 117వ జయంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు మాట్లాడుతూ మొహియుద్దీన్ స్వాతంత్ర సమరయోధుడిగా, మహాకవిగా, కార్మిక నాయకుడిగా, నటుడిగా, కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాతల్లో ఒకరిగా పని చేశారని గుర్తు చేశారు. నిజాం నిరంకుశత్వానికి ఎదురొడ్డి పోరాడిన గొప్ప పోరాట యోధుడన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, నాయకులు సురేష్, కృష్ణమోహన్, అజయ్‌కుమార్, మురళీకృష్ణ, బాబ్జినాయక్, రామకృష్ణ పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో 'అనంత' ప్రతిభ

అనంతపురం: విశాఖపట్నంలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో అనంతపురం జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. వివిధ దేశాల నుంచి సుమారు 1500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతపురం గోజుర్యో కరాటే స్కూల్‌కు చెందిన విద్యార్థులు వి. హాసిని రెడ్డి, జ్యోత్ సాయి ప్రశాంత్, సుజన్, ప్రియదర్శిని బాయి, జశ్వంత్, ప్రణీతి బంగారు, సాయి సిద్ధార్థ నాయక్, సాయింషా బాబా రజతం, హిమబిందు, మానస కాంస్య పతకాలు సాధించారు. కుమిటే విభాగంలో ఇల్లూరి సుదీప్ రెడ్డి, ప్రియదర్శిని భాయి బంగారు, జ్యోతి సాయి ప్రశాంత్, మానస, సాయింషబుూ బాబా రజతం, హాసిని రెడ్డి, హిమబిందు, సాయి సిద్ధార్థ నాయక్ కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విజేతలను పలువురు అభినందించారు.



పతకాలు సాధించిన క్రీడాకారులు

సంక్షిప్త సమాచారం

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించండి

రాప్తాడు: గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి యుగంధర్ సిబ్బందికి సూచించారు. ఆయన మంగళవారం రాప్తాడులో పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు, ఆస్పత్రి పరిసరాలు, మందుల గదిని పరిశీలించారు. పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్య సేవలపై రోగులతో ఆరా తీశారు. సీహెచ్‌ఓ శివ ప్రసాద్, సూపర్‌వైజర్లు అరుణ, నరసింహ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలి

ఆత్మకూరు: మనం ఎంత ఉన్నత స్థాయికి చేరుకున్నా తల్లిదండ్రులు, గురువులను తప్పక గౌరవించాలని రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పురావస్తు శాఖ ఏడీ రజితతో కలిసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులే మన జీవితంలో నిజమైన హీరోలన్నారు. వారి కష్టాన్ని గుర్తించి కష్టపడి చదివిన వారే ఉన్నత స్థాయికి చేరుతారని తెలిపారు. పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం: నగరంలోని అశోక్ నగర్‌లో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన మేరకు.. అశోక్‌నగర్‌లో నివాసం ఉంటున్న రాముకు ఇద్దరు కుమారులున్నారు. టీవీఎస్ ఫైనాన్స్ కంపెనీలో పని చేసే చిన్న కుమారుడు శంకర్ (29)కు ఇటీవల వివాహం జరిగింది. భార్య గర్భిణి కావడంతో పుట్టింటికి వెళ్లింది. దీంతో అశోక్‌నగర్‌లోని తన ఇంట్లో తమ స్నేహితుడితో కలిసి ఉంటున్నాడు. మంగళవారం స్నేహితుడు కుమార్ బయటికి వెళ్లడంతో లోపల గడియ పెట్టుకుని గది పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించాలి

ఆత్మకూరు: ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలని డీఎల్‌పీఓ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి లలితా బాయి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం గొరిదిండ్ల, ముట్టాల సచివాలయాలను తనిఖీ చేశారు. అనంతరం మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. ఎంపీడీఓ లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.